క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లోని శరవణ భవాలయంలో సుబ్రమణ్యేశ్వర స్వామి షష్ఠి బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించన్నారు. ఇతర వివరాలకు 83329 00101, 63034 62850 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మహాపడిపూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు

కడ్తాల్: మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండాలో అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం శుక్రవారం గురుస్వామి బిక్కునాయక్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఫలపత్ర, పుష్ప, పంచామృత అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి చంద్రమోహన్ నాయర్ స్వామి ఆధ్వర్యంలో ఇరుముడిధారణ కార్యక్రమం నిర్వహించారు. ఇరుముడి ధారణ అనంతరం మాలధారణ స్వాములు శబరిగిరికి బయలుదేరి వెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు గణేశ్‌గౌడ్, గణేశ్‌నాయక్, శ్రీను, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్‌కి చెందిన మాధవికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.21 వేలు మంజూరయ్యాయి. శుక్రవారం కడ్తాల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు నర్సింహ, గణేశ్, శ్రీను, రాజేశ్, శివ తదితరులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

కడ్తాల్: కడ్తాల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. శుక్రవారం నిర్మాణ పనులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎంపీపీ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని గుత్తేదారుకు సూచించారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈ పరమేశ్, సూపరింటెండెంట్ మహాలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ప్రతిమ, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్ తదితరులు ఉన్నారు.

బాలాజీసింగ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

సింగిల్ విండో డైరెక్టర్ జగన్‌గౌడ్

మాడ్గుల: ఉద్యమ నేత, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌కు గవర్నర్ కోటాలో గానీ స్థానిక సంస్థల కోటాలో గానీ ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సింగిల్ విండో డైరెక్టర్ జగన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మాడ్గులలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బాలాజీసింగ్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపులో బాలాజీసింగ్‌ది కీలకంగా పనిచేశారన్నారు.

తెలంగాణలో ప్రజాపాలన

టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: తెలంగాణలో గడీలపాలన నుంచి ప్రజలు విముక్తి పొందారని.. ప్రజా పాలనలో అడుగుపెట్టారని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తలకొండపల్లిలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంతో బీఆర్‌ఎస్ నిర్బంధ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ప్రజలకిచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్యసాయాన్ని అమలు చేశామన్నారు. 100 రోజుల్లోపు మిగితా గ్యారెంటీలను అమలుచేస్తామన్నారు.

18న కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈనెల 18న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటిచూపు మందగించిన వారికి ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని ఆయన కోరారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శరవేగంగా విస్తరణ పనులు

- రూ.600 కోట్లతో 24 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు
- పెద్దఅంబర్‌పేట, బాటసింగారంలో తుదిదశకు వంతెనల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వాహనదారులు



అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద నిర్మాణ దశలో జాతీయ రహదారి పనులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఏళ్లగా ఎదురుచూస్తున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా జాతీయ రహదారి విస్తరణ చేపట్టాలంటూ వస్తున్న ప్రతిపాదనలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు విస్తరణకు పచ్చజెండా ఊపడంతో గత 6 మాసాలుగా నత్తనడకన జరుగుతున్న విస్తరణ పనుల్లో ఇకనుంచి వేగం పుంజుకోనుంది. ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకూ ఉన్న 24 కిలోమీటర్ల మేర ఇరువైపులా మూడేసి రహదారుల(త్రీ లేన్) చొప్పున రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రూ.600కోట్లు మంజూరు కాగా కోవిడ్..గుత్తేదారుల సమస్యల వల్ల పెండింగ్‌లో పడుతూ రాగా తదనంతరం పనులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఈ విస్తరణ పనులు పూర్తయితే చాలావరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిలో ప్రస్తుతం పనులు ప్రారంభం కాగా హయత్‌నగర్ నుంచి దండుమల్కాపూర్ వరకూ రోడ్డు పనులు చివరిదశకు చేరుకున్నాయి.

నిత్యం వాహనాల రద్దీ...

నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారిపై చేపడుతున్న విస్తరణ పనుల్లో 8 ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వాహనాల రద్దీతో పాటు ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లోనే ఫ్లై ఓవర్లు నిర్మిస్తుండగా ఎల్‌బీనగర్ నుంచి దండు మల్కాపూర్ వరకూ చేపడుతున్న రోడ్డు విస్తరణలో వనస్థలిపురం పనామా కూడలి వద్ద, హయత్‌నగర్‌లో కుంట్లూర్ రోడ్డు వద్ద, పెద్ద అంబర్‌పేటలో పసుమాముల రోడ్డు, కోహెడ రోడ్డు వద్ద, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘటకేసర్ రోడ్డు, అనాజ్‌పూర్ రోడ్డు, ఇనాంగూడ, బాటసింగారం కూడళ్ల వద్ద మొత్తం 8 ఫ్లై ఓవర్లు నిర్మించనున్నారు. అయితే ఇప్పటికే పెద్దఅంబర్‌పేట, బాటసింగారం కూడలిలో వంతెన నిర్మాణాలు పూర్తవడానికి వచ్చాయి. విస్తరణ పనులు పూర్తయితే.. ఎల్‌బీ నగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు ఎటువంటి ట్రాఫిక్ జాం కాకుండా ఉంటుందని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు సహకరించాలి

కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం జూలై 2024 వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, తూప్రాన్‌పేట గ్రామాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డుకు ఆనుకుని ఉన్న భవనాల కూల్చివేతలు ఎంత త్వరగా చేస్తే రోడ్డు నిర్మాణ పనులు అంత త్వరగా పూర్తవుతాయి. విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలి. హయత్‌నగర్‌లో జీహెచ్‌ఎంసీ, అబ్దుల్లాపూర్‌మెట్, తూప్రాన్‌పేట గ్రామాల్లో ఆయా ఆర్డీఓ అధికారులతో కలిసి భవనాల కూల్చివేతలు చేపట్టేందుకు ఇప్పటికే కార్యచరణ రూపొందించాం. రహదారి విస్తరణ జరిగితే ప్రమాదాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవకాశం ఉంటుంది.

– శరత్‌చంద్ర, ఏఈ, ఎన్‌హెచ్ 65



భూమిపూజ చేస్తున్న నర్సింహ, నాయకులు

ఆలయ ముఖద్వారానికి భూమిపూజ

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో కొలువైయున్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ముఖద్వార నిర్మాణానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ శుక్రవారం భూమిపూజ చేశారు. ఆలయ ధర్మకర్త వింజమూర్ రామనుజాచార్యుల ఆధ్వర్యంలో మక్తమాధారం–షాద్‌నగర్ ప్రధాన రహదారిపై ఆలయానికి వెళ్లేమార్గంలో ముఖద్వారం నిర్మించనున్నారు. ముఖద్వార నిర్మాణదాత యాట నర్సింహను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సులోచన సాయిలు, ఉపసర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ మంజుల, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు నర్సింహగౌడ్, యాదగిరి, రామకృష్ణ, చెన్నయ్య, ప్రభాకర్, మహేందర్, నారాయణగౌడ్, కృష్ణయ్య, సాయిలు,రమేశ్, శ్రీరాములు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణిలో బండలేమూర్ గ్రామస్తుల ఫిర్యాదు

మంచాల: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మంచాల మండల పరిధిలోని బండలేమూర్ గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ధరణిలో ఉన్న లోపాల కారణంగా తమ భూ సమస్యలు పరిష్కారం కావడంలేదని అన్నారు. ఈ విషయమై అనేకమార్లు జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొనిపోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తెలిపారు. రైతులు దశరథ, జంగయ్య, గుండాలు, పెంటయ్య, ఎల్లయ్య, రాములు, అంజయ్య, లక్ష్మమ్మ, కళమ్మ, సుగుణమ్మ, మంగమ్మ పాల్గొన్నారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సును నడిపించాలని బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొంగరకలాన్‌లో ఉన్న కలెక్టరేట్‌కి పోవడానికి ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



నర్సరీని పరిశీలిస్తున్న రాంపాల్‌నాయక్

- మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: వర్షాకాలం నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ సూచించారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని ఆయన కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ నర్సరీలను శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యాంసుందర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయా నర్సరీల్లో సిద్ధం చేసిన బ్యాగ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటేందుకు అన్ని నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని కోరారు. మున్సిపాలిటీ ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచాలని నర్సరీల నిర్వాహకులను కోరారు. అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. శీతాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ సరుకులు ఇవ్వాలి

- సర్పంచ్ బల్‌రాం



రేషన్‌షాపు ప్రారంభోత్సవంలో నాయకులు

ఆమనగల్లు: ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సరుకులను వినియోగదారులకు సక్రమంగా అందించాలని పోలెపల్లి సర్పంచ్ బల్‌రాం, ఎంపీటీసీ దోనాదుల కుమార్ కోరారు. ఆమనగల్లు మండలం పోలెపల్లిలో నూతనంగా నియమించిన రేషన్ డీలర్ గొని నాగమణి రేషన్‌షాపులో శుక్రవారం సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా బల్‌రాం, కుమార్ మాట్లాడుతూ.. కార్డుదారులకు సకాలంలో సరుకులు అందించాలని కోరారు. ప్రభుత్వం సూచించిన సమయాల్లో షాపును తెరవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజన్‌రెడ్డి, స్థానిక నాయకులు రాములయ్య, ప్రేమలత, సుమతమ్మ, పెద్దిరాజు, భగవాన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రకాశ్, వెంకటయ్య, రాములయ్య, కాసయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని ఆపండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నర్సింహ

- ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న చర్చి నిర్మాణ పనులను నిలిపివేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తలకొండపల్లి మండలాధికారులకు వినతిపత్రం అందించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. అక్రమ నిర్మాణాన్ని ఆపి.. వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన వినతి పత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు వినోద్, కృష్ణ, శ్రీకాంత్, గణేశ్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దు హర్షణీయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఫార్మాసిటీ స్థానంలో మెగాసిటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఫార్మాసిటీని హైదరాబాద్‌కు దూరంగా తరలించాలని నిర్ణయించడం సరైందే అని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన నాయకులు ఘనంగా సత్కరించారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఏర్పాటును కందుకూరు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని.. ఎన్నికల సమయంలో, అంతకుముందు కాంగ్రెస్ పార్టీ ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఫార్మాసిటీని ఏర్పాటు చేయకుండా ఆ స్థానంలో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయనుందని ఆయన చెప్పారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఆమనగల్లు మాజీ వార్డు సభ్యుడు అల్లాజీ, మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

యాచారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం సరైందేనని.. అదే విధంగా ఫార్మా భూసేకరణలో కొంతమంది అధికారులు, బ్రోకర్లు రూ.కోట్లాది అక్రమాలకు పాల్పడ్డారని.. వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ముత్యాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీ భూసేకరణలో భారీ అవినీతి జరిగిందని.. పేద రైతులకు చెందాల్సిన డబ్బులను అధికారులు, బ్రోకర్లు తినేశారని అన్నారు. వెంటనే విచారణ జరిపి రైతులకు నష్టపోయిన డబ్బులను ఇప్పించాలని కోరారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఇబ్రహీంపట్నం: కాలుష్యకారక ఫార్మాసిటీని రద్దుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమైన అంశమని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత జగదీశ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. యాచారం, కందుకూర్ మండలాల ప్రజలు వద్దంటున్నా అక్రమంగా భూములు లాక్కొని గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఫార్మాతో సుమారు 150 కిలో మీటర్ల రేడియేషన్ పరిధిలో గాలి, నీరు కలుషితమై ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా మారే అవకాశం ఉందని మేధావులు, ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పెడచెవిన పెట్టిందన్నారు. ఫార్మాసిటీకి దిగువ భాగంలో ఉండే ఇబ్రహీంపట్నం మండల ప్రజలకు మరింత ముప్పుగా మారేదన్నారు. ఫార్మాసిటీని రద్దుచేసి ఆస్థానంలో మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు కల్వకుర్తి, మహేశ్వరం నియోజకవర్గాల్లోని చాలా ప్రాంతాల్లో ఫార్మాసిటీకి సంబంధించి దుష్ప్రభావాలు పడే అవకాశం ఉందన్నారు. నీటి కలుషితంతో పాటు స్థానికంగా రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మెజార్టీ ప్రజలు వ్యతిరేకించిన ఫార్మాసిటీని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో రైతులనుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. మెగా టౌన్‌షిప్ ఏర్పాటుతో ఇక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభించే విధంగా ఫార్మా భూములను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి

కందుకూరు: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం దాసర్లపల్లికి చెందిన వార్డు సభ్యులు కలిసి సన్మానించారు. అనంతరం తమ గ్రామానికి రద్దయిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. వెంటనే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు యుగంధర్‌గౌడ్, శారదశేఖర్‌ముదిరాజ్, మహ్మద్ రహీజ్, శివశంకర్‌గౌడ్, కృష్ణ, రాజేందర్‌ముదిరాజ్, కాజా, శ్రీరాములు, రాములు, యాదయ్య, రాజు, శేఖర్‌గౌడ్, కృష్ణాగౌడ్, రాములు, లింగమయ్య, రాజు, ఖాదర్‌పాషా, అలీ, షేక్ షబీర్, బాల్‌రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

సైన్స్ పరికరాలపై అవగాహన

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైన్స్ పరికరాలపై అవగాహన కల్పించారు. ప్రకృతిలో జరిగే మార్పులు, వాటి పరిణామాలపై వివరించారు. ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి ఉంటే శాస్త్రవేత్తలుగా రాణించవచ్చన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. దివంగత భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం లాగా పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్తు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, అశోక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

భట్టిని కలిసిన మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను నగరంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి కలిశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



భట్టి విక్రమార్కతో మల్‌రెడ్డి రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

పనులు ఆపారు.. సమస్య మరిచారు

- అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు
- జనప్రియ మహానగర్‌లో నిర్మాణ పనులకు బ్రేక్
- అవస్థలు పడుతున్న స్థానికులు



జనప్రియ మహానగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

మీర్‌పేట: రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నత్తకు నడక నేర్పిన చందంగా అధికార యంత్రాంగం పనుల విషయంలో జాప్యం వహిస్తోంది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జనప్రియ మహానగర్‌లో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి వరదనీరు ముంచెత్తడంతో ఓ వైపు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తరువాత ముంపు సమస్య పరిష్కారం కోసం కాలనీ మీదుగా అధికారులు ట్రంక్‌లైన్ వేశారు. వాటి పనులు పూర్తయి సంవత్సరం గడిచినా రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాదాపు 8 నెలల క్రితం బీటీ రోడ్డు వేసేందుకు గాను రూ.50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. కాలనీ ముఖద్వారం నుంచి సగం వరకు రహదారి వేయించిన అధికారులు మిగతా సగం వేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. కొంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండు నెలలుగా నిలిపివేయడంతో జనప్రియవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు శ్రమించాల్సి వస్తోంది.

పార్కింగ్‌కు అడ్డాగా..

అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు ఓ వైపు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్గం సైతం చిన్నగా ఉండడంతో వాహనాల రద్దీ ఎక్కువ అయింది. పనుల నిమిత్తం బయటికి వెళ్లే స్థానికులు రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. రహదారి ధ్వంసమైన చాలా కాలం తరువాత బీటీ రోడ్డు వేస్తుండడంతో సమస్య పరిష్కారం అవుతుందని అనుకునేలోపే కాంట్రాక్టర్ సగంలోనే వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మిగతా రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

ముడిసరకు కొరత వల్ల రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే పనులు మొదలు పెడతాం. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– శ్రీనివాస్, ఏఈ, మీర్‌పేట

‘ఫార్మా’ భూములను తిరిగిచ్చేయాలి

- జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటపై నిలబడి ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకు పంచాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల నుంచి సేకరించిన భూములను వారికే అప్పగిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. దాన్ని విస్మరిస్తూ ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మెగాసిటీని ఏర్పాటు చేస్తామని చెప్పడం రైతుల్ని మోసం చేయడమేనని విమర్శించారు. మెగా సిటీ టౌన్‌షిప్ పేరుతో కాంగ్రెస్ ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపిందని ఆరోపించారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభించేవన్నారు. టౌన్‌షిప్ నిర్మిస్తే ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకునే బదులు పొలాలను రైతులకు ఇచ్చేలా కృషి చేయాలని హితవుపలికారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.